# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | శనివారం 12 సెప్టెంబర్ 2026




## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి ప్రతిమలనే పూజిద్దాం

- చౌటుప్పల్‌లో ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ
- భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం
- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: వెన్‌రెడ్డి రాజు

**తొలివెలుగు, చౌటుప్పల్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ మాజీ చైర్మన్, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.nభారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సౌజన్యంతో శుక్రవారం చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెన్‌రెడ్డి రాజు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా **మిగతా 2లో..**



## వైభవంగా కనకదుర్గమ్మకు క్షీరాభిషేకం

2

- 108 లీటర్ల ఆవుపాలతో ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు

**తొలివెలుగు, చిట్యాల:** శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం చేశారు. అభిషేక మహోత్సవానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, శ్రీ బాలనర్సింహస్వామి ఆలయ ఛైర్మన్ ఇమ్మడి వెంకన్న, కనకదుర్గ **మిగతా 2లో..**

# ఆర్యవైశ్యుల బోనమెత్తిన 'రాజాపేట'



- భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పణ
- వర్షాలు సమృద్ధిగా కురవాలి.. పంటలు పండాలని ప్రత్యేక పూజలు
- డప్పుచప్పుళ్ల నడుమ పోచమ్మ ఆలయానికి బోనాల శోభాయాత్ర



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా మడి దుస్తులు ధరించి అమ్మవారికి నైవేద్యాన్ని సిద్ధం చేశారు. అనంతరం అలంకరించిన బోనం కుండలను నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ సామూహికంగా శోభాయాత్రగా బయలుదేరారు. గడికోటలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు కూడా బోనాల వేడుకల్లో పాల్గొని పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి.

# తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా జరపాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం
- అమరుల త్యాగాలను స్మరించుకోవాలి
- 'సప్త సంకల్పాలు' అమలు చేయాలని డిమాండ్



**తొలివెలుగు, చిట్యాల :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ చిట్యాల పట్టణ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు అనేక మంది వీరులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, అమరుల త్యాగాలకు గౌరవం కల్పించాలని కోరారు. తెలంగాణ పోరాట చరిత్రను శాశ్వతంగా పరిరక్షించేందుకు 'సప్త సంకల్పాలు' కార్యక్రమాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాస శ్రీనివాస్, నాయకులు చికిలంమెట్ల అశోక్, జయారపు రామకృష్ణ, గోశిక వెంకటేశం, కంచర్ల శంకర్‌రెడ్డి, దుడ్డు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
శనివారం 12 సెప్టెంబర్ 2026

# గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళికలు

- అంకిరెడ్డిగూడెంలో వికసిత్ గ్రామపంచాయతీ గ్రామసభ
- మౌలిక వసతులు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం
- గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్ :** గ్రామాల సర్వాంగీణ అభివృద్ధే లక్ష్యంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ (వీజీపీపీ) ప్రతిపాదనలను రూపొందిస్తున్నట్లు చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ గ్రామసభ నిర్వహించారు. ఏపీవో ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధుల కల్పన, విపత్తుల నిర్వహణకు సంబంధించిన పనులను ప్రణాళికలో పొందు పరుస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 60:40 నిధుల భాగస్వామ్యంతో అమలు చేసే పథకాల్లో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని రైతులకు అవసరమైన పనులతో పాటు అంగన్‌వాడీ భవనాలు, గ్రంథాలయం, నైపుణ్యాభివృద్ధి భవనం నిర్మాణం, సీసీ రోడ్లు, మెటల్ రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామ ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బత్తుల అనుష మహేష్‌గౌడ్, దొడ్ల అండాలు సెట్టయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, ఆశా కార్యకర్త బొల్లు అండాలు, ఉపాధి హామీ కూలీలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు

- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర
- ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన వేడుక



**తొలివెలుగు, చిట్యాల :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని చిట్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, మండల విద్యాధికారి పొనుగోతు సైదానాయక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషి కీలకమని పేర్కొన్నారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని అన్నారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యారంగంలో వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో పాండు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకర్‌రెడ్డి మృతి తీరని లోటు: గొంగిడి సునీత


- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి కుటుంబానికి పరామర్శ
- పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం
- కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే భరోసా



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాశం ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు.ప్రభాకర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం ఆయన నివాసానికి చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి పార్టీకి అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, నాయకులు కోరే బిక్షపతి, యాస కవిత, యాస ఇంద్రారెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- పంతంగి టోల్‌గేట్ సమీపంలో ఘటన



**తొలివెలుగు, చౌటుప్పల్:** ముందు వెళ్తున్న వాహనాన్ని ద్విచక్రవాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన నోముల నాగమ్మ చిన్న కుమారుడు దీపక్ (22) హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి (సెప్టెంబరు 10న) దీపక్ తన స్నేహితుడు దున్నపోతుల శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మరొక స్నేహితుడు చీమ ఉదయ్ వేరే బైక్‌పై వారి వెనకాలే వస్తున్నాడు. రాత్రి 9:20 గంటల ప్రాంతంలో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తుతెలియని డీసీఎం వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో వెనుక ఉన్న బైక్ వేగం అదుపుకాక డీసీఎంను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపక్ తలకు డీసీఎం హుక్ గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బైక్‌పై ఉన్న శ్రీకాంత్ తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే వస్తున్న ఉదయ్ కూడా బైక్ కంట్రోల్ కాక కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాంత్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ ఎస్సై డి.నర్సిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి ప్రతిమలనే పూజిద్దాం

మొదటిపేజీ తరువాయి:

ఫోరం ట్రస్ట్ సభ్యుడు బొబ్బిళ్ల మురళి మాట్లాడుతూ.. ‘మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం’ అనే సందేశంతో ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రసాయనాలు, ఇతర కాలుష్యకారకాలతో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా మట్టి వినాయకులనే పూజించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాలయ డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సుర్వి నరసింహగౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ధర్మకర్తలు ఆవుల యేసు యాదవ్, వర్కాల రవిగౌడ్, బొబ్బిళ్ల సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మకు క్షీరాభిషేకం

మొదటిపేజీ తరువాయి:

ఆలయ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నర్సిరెడ్డి, జిట్టా శేఖర్, రుద్రారపు లింగయ్య, వెలితే సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయన్న తదితరులు పాల్గొన్నారు.

# రాక్‌టౌన్ కాలనీ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- జోనల్ కమిషనర్ వికాస్ మహతోకు కాలనీవాసుల వినతి
- పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి
- సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** ఎల్‌బీనగర్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం జోనల్ కమిషనర్ వికాస్ మహతోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేసి కాలనీ వాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ ప్రతినిధుల వినతిపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ డివిజన్ రాక్‌టౌన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సలహాదారు సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో 'చవితి' వేడుకలు జరుపుకోవాలి

- నిబంధనలు పాటిస్తూ విగ్రహాల ప్రతిష్ఠాపన
- మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి
- పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలి: ఎస్ఐ సతీష్ గోపాతి

**తొలివెలుగు, రామన్నపేట :** వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రామన్నపేట ఎస్ఐ సతీష్ గోపాతి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉత్సవ నిర్వాహకులు విద్యుత్, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజేలు, అధిక శబ్దాలతో ప్రజలకు, పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు కలగకుండా నిబంధనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించి వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ సతీష్ గోపాతి విజ్ఞప్తి చేశారు.




# నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దు

- మన్సూరాబాద్ పెద్ద చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన
- రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- అధికారులకు మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచన



**తొలివెలుగు, మన్సూరాబాద్/ఎల్‌బీనగర్:** మన్సూరాబాద్ పెద్ద చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. చెరువు వద్ద అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మన్సూరాబాద్ పెద్ద చెరువులో భారీ సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా వనస్థలిపురం, చింతలకుంట, నాగోలు, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే మార్గాల్లో గుంతలను పూడ్చి, రహదారుల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. నిమజ్జన సమయంలో భక్తులు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భక్తుల కోసం అవసరమైన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులు అధికారులు ఏర్పాటు చేసిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ, నిమజ్జన సిబ్బందికి సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కొప్పుల నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

- విలేకరి మాతృమూర్తి మృతిపట్ల వాకిటి సంతాపం
- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత



**తొలివెలుగు, వలిగొండ:** మండల సీనియర్ విలేకరి ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, నాయకులు బొడ్డు వెంకటరమణ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కల్యూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామి దేవాలయ ఛైర్మన్ గంజి అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేశ్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఛైర్మన్ తోగరి కరుణాకర్
- జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా: ముత్యాల రమేశ్



**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ తోగరి కరుణాకర్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణకు రమేశ్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఛైర్మన్ తోగరి కరుణాకర్‌కు ముత్యాల రమేశ్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ముత్యాల రమేశ్ నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# సందడిగా 'మహా' ఆగమన్



**హైదరాబాద్:** ఖైరతాబాద్‌లో మహాగణపతిని ఆహ్వానిస్తూ స్థానిక యువజన సంఘం నిర్వహించిన ఆగమన్ కార్యక్రమం సందడిగా సాగింది. శుక్రవారం సాయంత్రం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాల అలంకరణ మధ్య బ్యాండ్ మేళాలతో నృత్యం చేస్తూ వినాయకుడిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి అతిథులుగా హాజరయ్యారు.

# ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో.. నిందితుడు చిక్కాడు

## డీజీపీ సీవీ ఆనంద్



**తొలివెలుగు, హైదరాబాద్:** సికింద్రాబాద్ బొల్లారం కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో ఆయుధాల చోరీ కేసులో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కీలకంగా వ్యవహరించారు. వందలాది సీసీటీవీ కెమెరాలు, అనుమానితులు, వేలాది సెల్‌ఫోన్ కాల్ డిటెల్ రిపోర్టు విశ్లేషించారు. గతంలో సైన్యంలో పనిచేసి అనారోగ్యం, క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఉద్యోగం నుంచి తొలగించిన మాజీ హవిల్దార్ ఉప్పుతోళ్ల మల్లేశ్ అలియాస్ రాజును నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. గత నెల 31న కేసు నమోదు చేసినప్పటి నుంచి 10 రోజుల పాటు నగర సీపీ సజ్జనర్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ల బృందాలు భిన్న కోణాల్లో దర్యాప్తులో భాగమయ్యాయి.

**టెంట్‌లో బస.. సాంకేతిక ఆధారాల సేకరణ**

ఆయుధాలు అపహరణకు గురైన మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ వద్ద తాత్కాలికంగా టెంట్ ఏర్పాటు చేశారు. ఆర్మీ, పోలీసు అధికారులు అక్కడే ఉంటూ కేసు దర్యాప్తు పరిశీలించారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంటోన్మెంట్ పరిధిలో నివాసాలు, వ్యాపార సముదాయాలు, పోలీసులు ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించారు. వందల మందిని ప్రశ్నించారు. రోజూ 10–12 గంటలపాటు అనుమానితులను ప్రశ్నించటం, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తును కొనసాగిస్తూ చిన్నపాటి ఆధారంతో కేసును కొలిక్కి తీసుకురాగలిగారు. ఇటీవల సైన్యం నుంచి తొలగించిన వారు, రిటైర్‌మెంట్ పొందిన సైనికులు, అధికారులతో జాబితా తయారు చేశారు. గతనెల 30న నేరం జరిగిన సమయంలో వీరంతా ఎక్కడున్నారు.? ఏం చేస్తున్నారనే? వివరాలు రాబట్టారు. వారిలో 10మంది హైదరాబాద్‌లోనే ఉన్నట్టు అంచనాకు వచ్చారు. వారిలో మల్లేశ్ మాత్రం గత నెల 28, 29 తేదీల్లో బొల్లారం పరిసర ప్రాంతాల్లో తిరిగినట్టు సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. అతడి గురించి పూర్తి వివరాలు సేకరించినపుడు అసలు బండారం బయటపడింది. క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు, అనారోగ్యం కారణంగా అతడిని తొలగించినట్టు గుర్తించారు. ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉండటం, సైనికుల కోడ్‌భాషను ప్రయోగించి ఆయుధాలు ఎత్తుకెళ్లినట్లు తేల్చారు. నిందితుడి సొంతూరు అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లికి వెళ్లిన టాస్క్‌ఫోర్స్ బృందాలు అక్కడ సీసీటీవీ కెమెరాలను పరిశీలించాయి. కారులో అనుమానాస్పదంగా తిరిగినట్టు ఫుటేజీలో గుర్తించి.. అతడే సూత్రధారి అనే నిర్ధారణకు వచ్చారు. మల్లేశ్ భార్య సహకారంతో ఎట్టకేలకు ఆయుధాల ఆచూకీ తేలికగా గుర్తించగలిగారు.

# ప్రమాదరహితంగా గణేష్ వేడుకలు జరుపుకుందాం

- మండపాల నిర్వాహకులకు విద్యుత్తు శాఖ సూచనలు
- మండపాల వద్ద విద్యుత్తు భద్రతా చర్యలు తప్పనిసరి
- సమాచారమిస్తే సిబ్బంది అందుబాటులో ఉంటారు: ఏఈ రాజుల సతీష్‌కుమార్



**తొలివెలుగు, చౌటుప్పల్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విగ్రహాల తరలింపు, మండపాల వద్ద విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చౌటుప్పల్ విద్యుత్తు శాఖ ఏఈ రాజుల సతీష్‌కుమార్ సూచించారు. విద్యుత్తు భద్రతా నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. గణేష్ విగ్రహాలను వాహనాల్లో తరలించే సమయంలో పైన ఉన్న విద్యుత్తు తీగలకు తగిలే అవకాశం ఉన్నందున నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్తు తీగల పరిస్థితిని ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు. మండపాల నిర్వాహకులకు విద్యుత్తుకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉన్నా, ముందస్తుగా సమాచారం అందించినా విద్యుత్తు సిబ్బందిని అందుబాటులో ఉంచి అవసరమైన భద్రతా చర్యలు చేపడతామని ఏఈ రాజుల సతీష్‌కుమార్ తెలిపారు. గణేష్ మండపాల్లో నాణ్యమైన విద్యుత్తు వైర్లు, ఎంసీబీలు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. వైర్లు రేకులు, ఇనుప పైపులు తదితర లోహ వస్తువులకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు లోడ్‌కు అనుగుణంగా సరైన గేజ్ కలిగిన వైర్లను వినియోగించాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు విద్యుత్తు శాఖ సిబ్బందికి సహకరించి, ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎలాంటి విద్యుత్తు ప్రమాదాలకు తావులేకుండా గణేష్ వేడుకలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఏఈ రాజుల సతీష్‌కుమార్ కోరారు.

# గురుకులాల్లో విద్యార్థుల భద్రతకు ఏదీ హామీ?

- సంస్థాన్ నారాయణపూర్ హాస్టళ్లలో వరుస ఘటనలపై ఆందోళన
- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రాత్రి బస చేసి సమస్యలు తెలుసుకోవాలి: కార్తీక్‌గౌడ్



**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపూర్ :** మండల పరిధిలోని గురుకులాలు, వసతి గృహాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్నట్లు వెలువడిన ఘటనలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ల కార్తీక్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కస్తూర్బా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు బయటకు వెళ్లినట్లు, సర్వేల్ గురుకులంలో ఇద్దరు బాలురు గోడ దూకి తిరుపతికి వెళ్లినట్లు వెలువడిన సమాచారం ఆందోళన కలిగిస్తోందని కార్తీక్‌గౌడ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకులాలు, వసతి గృహాల్లో అధికారులు పర్యవేక్షణను మరింత పెంచాలని కోరారు. శుక్రవారం గిరిజన గురుకులాన్ని సందర్శించిన కార్తీక్‌గౌడ్.. జ్వరంతో బాధపడుతున్న 15 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గురుకులానికి కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో సొంత భవనం నిర్మించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కార్తీక్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు శాశ్వత భవనం నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గురుకులాలు, వసతి గృహాలను స్వయంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని కార్తీక్‌గౌడ్ కోరారు. సాధ్యమైనంతవరకు ఒకటి, రెండు రోజులు అక్కడే బస చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే పరిస్థితులపై మరింత స్పష్టత వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్కూరి శ్రీకాంత్, కొత్త రాజు, చెరుకు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి

- చౌటుప్పల్ తహసిల్దార్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం
- రజాకార్ల బాధిత గ్రామాల్లో స్మారక స్తూపాలు నిర్మించాలి
- 'సప్త సంకల్పాలు' తక్షణమే అమలు చేయాలి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ విమోచన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ రూపొందించిన 'సప్త సంకల్పాలను' ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని 'స్టాట్యూ ఆఫ్ లిబరేషన్'గా ప్రతిష్ఠించాలని కోరారు. హైదరాబాద్‌లో విమోచన మ్యూజియం, ప్రతి జిల్లా కేంద్రంలో స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రతో పాటు అజ్ఞాత వీరుల జాబితాను చేర్చాలని కోరారు. రజాకార్ల దురాగతాలకు బలైన గ్రామాల్లో స్మారక స్తూపాలను నిర్మించి వారి త్యాగాలను స్మరించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ విమోచన చరిత్రకు సంబంధించిన ప్రాంతాలను అనుసంధానిస్తూ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దూడల భిక్షం గౌడ్, భువనం మధుసూదన్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, చినుకని మల్లేశం యాదవ్, గ్యాస్ అశోక్‌రెడ్డి, పబ్బతి శేఖర్‌గౌడ్, కట్ట కృష్ణ, కదారి ఐలయ్య, దిండు భాస్కర్, బోయ సదానందం, బాతరాజు ధనుంజయ, మునగాల అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.